బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

శాలిగౌరారం, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కార్యకర్తలంతా పోరాడాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఇటుకుల పహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్కెనపెల్లి శ్రీరాములు ఇంట్లో కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్న గౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, చింతల శంకర్, శేషరాజుపెల్లి వెంకన్న, బస్వరాజు ఉన్నారు.

ఉమ్మడి సర్వీస్ నిబంధనలు అమలు చేయాలి

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

సమావేశంలో మాట్లాడుతున్న కటకం రమేశ్

రామగిరి, డిసెంబర్ 8: ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు అమలు చేయాలని ఆదిశగా సర్వీస్ నిబంధనలు రూపొందించి వచ్చే విద్యా సంవత్సరం నాటికి రెగ్యులర్ ప్రాతిపదికన ఎంఈఓ, డైట్ అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రజా విజయోత్సవ ఫలాలను అందించాలన్నారు. నిలిచిపోయిన జీహెచ్ఎం పదోన్నతులు చేపట్టి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. పీఆర్సీ నివేదికను అమలు చేయాలని, జీఓ 317తో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ బలపర్చిన అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి టీఆర్‌టీఎఫ్ కూడా మద్దతు ఇస్తుందని వెల్లడించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, రాష్ట్ర చీఫ్ పాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముప్పిడి మల్లయ్య, ఉభయ రాష్ట్రాల కన్వీనర్ విష్ణుమూర్తి, ధరావత్ రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు సుంకిశాల ప్రభాకర్‌రావు, కావలి అశోక్, నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగోటి జనార్దన్, తరాల పరమేశ్‌యాదవ్, 33 జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బాలూనాయక్

సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), డిసెంబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52 లక్షల విలువైన చెక్కులను ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండలో ఉన్న వంద పడకల ఆస్పత్రిని 200 పడకలకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నేరేడుగొమ్ము, చందంపేటకు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ముక్కమల వెంకటయ్యగౌడ్, పున్న వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, వేణుధర్‌రెడ్డి, హనుమంతు వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీలు దూదిపాల రేఖ, ముత్యాల సర్వయ్య, గోవిందుయాదవ్, బిక్కునాయక్, రుక్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి : ఎమ్మెల్యే బీఎల్ఆర్

ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 8: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ బాపూజీనగర్ కాలనీలోగల పుట్ట గుడి వద్ద శ్రీనాగేంద్ర స్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కొమ్మన నాగలక్ష్మి, పాతూరి ప్రసాద్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మునుగోడులో ఉచిత వైద్య శిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సినీనటి అరియానా గ్లోరి

మునుగోడు, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కేవీఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు కర్నాటి విద్యాసాగర్ జన్మదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో యశోద ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సినీ నటి అరియానా గ్లోరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొడ్డు నాగరాజుగౌడ్, అనగంటి కృష్ణ, బొమ్మరబోయిన రాజు, మాదగోని నరేందర్, ముప్పవరం ప్రవీణ్, కొంపెల్లి వెంకటేశ్, మేడి అశోక్, పోలె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో రక్తదాన శిబిరం

నాగరాజుకు అవార్డు అందిస్తున్న వైద్యులు

నార్కట్‌పల్లి, డిసెంబర్ 8 : మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో పేదలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించి 100 రోజులు పూర్తయిన సందర్భంగా క్యాన్సర్ బాధితుల కోసం రక్త దాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 70 మంది రక్త దానం చేయగా ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన హైదరాబాద్ వారు 'మనం స్వచ్ఛంద సంస్థకు అవార్డును అందించారు.

ఉద్యోగులకు సన్మానం

చిట్యాల, డిసెంబర్ 8 : ఇటీవల వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన వారిని గుండ్రాంపల్లి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గండూరి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు మారుపాక అంజయ్య, ప్రధాన కార్యదర్శి గరిషె అంజయ్య, కోశాధికారి పంతంగి వెంకటేశం, మహిళా కార్యదర్శి శంకరమ్మ పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- ఏడాది కాలంలో సాగర్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, డిసెంబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయదని, అభివృద్ధి విషయంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దానిని కప్పిపుచ్చుకునేందుకే ప్రజాపాలన సంబురాల పేరుతో డ్రామాలు ఆడుతున్నదని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ విమర్శించారు. ఆదివారం హాలియాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమేనా అని స్థానిక ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది కాలంలోనే అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి రూ.150కోట్లు తీసుకొచ్చి రోడ్లు, భవనాలు, వంతెనలు, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటి ఎమ్మెల్యే ఏడాది కాలంలో నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతగాక బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతును రాజుగా చేయడంతో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా అమలు చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతు భరోసా బంద్ చేయడంతో పాటు రైతు బీమా కూడా సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఆసరా పింఛన్లు పెంచలేదని, ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం ఇస్తామని నేటికీ ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ పాలన పేరుతో రాష్ట్రంలో పోలీస్ పాలన సాగిస్తున్నదన్నారు. మీది ప్రజాపాలన అయితే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిగా పనిచేసిన ఉద్యోగులను నేడు స్థానిక ఎమ్మెల్యే రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. హాలియా మున్సిపాలిటీ అయ్యే నాటికి గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఉద్యోగులే ఉన్నారని, అయినా వారిలో ఏ ఒక్కరినీ తాము రాజకీయ వేధింపులకు గురిచేయలేదన్నారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి చేస్తున్న వికృత చేష్టలను చూసి జానారెడ్డి సిగ్గుతో తలదించుకునే రోజు వస్తుందన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ నాయకులకు తిరిగి వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. రాజకీయాలు హుందాగా ఉండలే గానీ కక్షసాధింపు ధోరణితో కాదని హితవు పలికారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అనుముల ఏడుకొండలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, జానయ్య, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, రవినాయక్, తాటి సత్యపాల్, నాగుల చవితి తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీశ్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటాచారి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు చాపల సైదులు, రావుల లింగమ్మాలింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు సురభిరాంబాబు, ఆవుల సైదులు, యూత్ అధ్యక్షుడు సైదాచారి, సైదులు, జానకిరాములు, మధు పాల్గొన్నారు.

తిరుపతిరావుకు నియామకపత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

బీఆర్ఎస్ పార్టీ గుర్రంపోడు అధ్యక్షుడిగా తిరుపతిరావు

హాలియా, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ పార్టీ గుర్రంపోడు మండల అధ్యక్షుడిగా నాగులవంచ తిరుపతిరావును నియమించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆదివారం హాలియాలోని తన నివాసంలో తిరుపతిరావుకు నియామకపత్రం అందించారు. శాలువాతో సన్మానించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడటంతో పాటు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన కోరారు.

గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

రామగిరి, డిసెంబర్ 8: జిల్లా గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ భవనంలో జరిగిన సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుపులేటి నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకట్, కోశాధికారిగా భవిరిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, ఎం.వీరస్వామి, భీమిరెడ్డి, బి.మట్టారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఉపేందర్, ఎన్.సుమతి, రాష్ట్ర ప్రతినిధిగా ధర్మూరి వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యు పాల్గొన్నారు.

అల్లాచారి కుటుంబానికి భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడ, డిసెంబర్ 8: పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన మండలోజు అల్లాచారి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు వా రి ఇంటికి వెళ్లి అల్లాచారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంగోతు హతీరాంనాయక్, తలకొప్పుల శ్రీధర్‌రెడ్డి, పందిరి వేణు, వెంకటేశ్వర్లు, కటికం సైదులురెడ్డి, గణపురం కృష్ణయ్య, సోమాచారి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, డిసెంబర్ 8 : ఈ నెల 9 నుంచి 14 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రామడుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామడుగు, కుపాసిపల్లి 11 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ధన్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్‌లో 400 కేవీ విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని పేర్కొన్నారు. రైతులు, గృహ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వెల్మినేడును మండలంగా ప్రకటించాలి

చిట్యాల, డిసెంబర్ 8 : వెల్మినేడును మండలంగా ప్రకటించాలని వెల్మినేడు మండల సాధన సమితి గౌరవాధ్యక్షుడు దేశబోయిన నర్సింహ్మ, అధ్యక్షుడు పాలగోని శివప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో జరిగిన సమితి సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ విషయమై త్వరలో ఎమ్మెల్యే, మంత్రులను కలిసి వినతి పత్రాలు అందిస్తామన్నారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి కూ నూరు గణేశ్, సహాయ కార్యదర్శులు గోలి సాయికిరణ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాలు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, డిసెంబర్ 8: పట్టణంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తాళాలు పగులగొట్టి పంచలోహ విగ్రహాలు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు 24 గంటల్లో అరెస్ట్ చేశారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి గ్రామం రాజీవ్‌నగర్‌కు చెందిన మంజీత్‌సింగ్ పట్టణంలోని బాపూజీనగర్‌లోని తన అత్తగారింటికి వచ్చి పోతూ ఉంటాడు. ఈ నెల 6న రాత్రి 11.30 గంటలకు ఎఫ్‌సీఐ వద్ద సాగర్‌రోడ్డులో గల రామలింగేశ్వరస్వామి ఆలయం గర్భగుడి గ్రిల్స్‌కు వేసిన తాళం పగులగొట్టి గుడిలోని పార్వతీ, శంకరుడు, చండీశ్వరుడి ఉత్సవ విగ్రహాలతో పాటు పార్వతీదేవి మూల విరాట్ విగ్రహం, 4 గ్రాముల రెండు బంగారు పుస్తెలు చోరీ చేసి పరారయ్యాడు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా ఆ ప్రాంతంలోని అన్ని కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. చోరీ చేసిన విగ్రహాలను తెల్లని బస్తాలో ఉంచి పండ్ల ట్రేలో పెట్టి ద్విచక్రవాహనంపై మిర్యాలగూడ నుంచి కోదాడ వైపునకు వెళ్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు ఆగస్టులో మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో గుడి తలుపులు పగులగొట్టి నాలుగు అమ్మవారి పట్టు చీరలను చోరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. విగ్రహాల చోరీ కేసును 24గంటల్లో చేధించిన రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ లోకేశ్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌ను డీఎస్పీ అభినందించారు.

మరో కేసులో

ఇందిరమ్మ కాలనీలోగల హోంగార్డు ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. ఈ నెల 4న మధ్యాహ్నం ఇందిరమ్మకాలనీకి చెందిన నాగరాజు హోంగార్డు ఇంట్లోకి వెళ్లి బీరువాలోని రూ.1.80 లక్షలను ఎత్తుకెళ్లాడు. నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.1.79 లక్షలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

మహిళ జీవనోపాధికి సాయం

కిరాణా షాపునకు అవసరమైన సరుకులు అందిస్తున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్, డిసెంబర్ 8 : నకిరేకల్ పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళకు జీవనోపాధి కల్పించారు. ఫౌండేషన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల పల్లి మండలం చెర్వుపల్లి గ్రామానికి చెందిన మర్రి వెంకటమ్మ భర్త కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందాడు. వారు దత్తత తీసుకున్న బాబు దివ్యాంగుడు. బాబు శివ వైద్యంతో పాటు జీవనోపాధి లేక ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆమెకు కిరాణం షాపు పెట్టేందుకు అవసరమైన రూ.20వేల ఫ్రిజ్, సరుకులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్, మౌనిక, ఆకుల సంతోశ్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి, డిసెంబర్ 8 : మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన చింతకింది అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు (గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో 2003–2004 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు) ఆదివారం అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి రూ.64 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోమటిరెడ్డి నర్సిరెడ్డి, గోవర్దన్, పర్వతాలు, నాగరాజు, శంకర్, అశోక్, మదనాచారి, లింగస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి

నాంపల్లి, డిసెంబర్ 8 : మండలంలోని మేళ్లవాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పగిళ్ల లచ్చయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి లచ్చయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వేముల మల్లయ్య, గట్ల శేఖర్‌రెడ్డి, చింతల ప్రసాద్, వేముల కిరణ్, సతీశ్ ఉన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన విద్యాసాగర్


మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్

నాంపల్లి, డిసెంబర్ 8 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ ఆదివారం కలిశారు. తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై కేసీఆర్‌కు వివరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును కూడా ఆయన కలిశారు.

కేసీఆర్‌పై ప్రేమతో..

కేసీఆర్ పేరుతో రైతు రూపొందించిన నారుమడి

శాలిగౌరారం, డిసెంబర్ 8 : మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన రైతు చింతల శంకర్ తన వ్యవసాయ క్షేత్రంలో యాసంగి సాగులో భాగంగా నారు పోశాడు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న ప్రేమతో నారు మడిలో ఆయన పేరు వచ్చేలా మడిని అలికాడు. ప్రస్తుతం నారు పెరగడంతో పచ్చటి నారుమడిలో కేసీఆర్ పేరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది.

ఆంజనేయ ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కేశవరెడ్డి

నిడమనూరు, డిసెంబర్ 8 : మండలంలోని రేగులగడ్డ ఆంజనేయస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఆలయంలో నిర్వహించారు. చైర్మన్‌గా చామల కేశవరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు బొల్లెంపల్లి కళమ్మ, పిల్లి సైదమ్మ, చామల రాంరెడ్డి, మల్లికంటి అంజయ్యతో దేవాదాయశాఖ మిర్యాలగూడ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, ఈఓ ఎస్.నవీన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరీ మట్టారెడ్డి, ముంగి శివమారయ్య, నర్సింగ్ విజయ్‌కుమార్, కొండా శ్రీనివాస్‌రెడ్డి, చామల ప్రభాకర్‌రెడ్డి, సోమనబోయిన శ్రీనివాస్‌యాదవ్, చామల ఉపేందర్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

విద్యార్థినులకు దుప్పట్లు అందిస్తున్న నిఖిల్ ధనుంజయ్

కేతేపల్లి, డిసెంబర్ 8 : మండలంలోని చెరుకుపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు తుంగతుర్తి గ్రామానికి చెందిన డీఎస్పీ సందీప్‌రెడ్డి సహకారంతో సెంచురీ పరుపుల కంపెనీ సామాజిక సేవా ఆర్థిక వనరుల ద్వారా రూ.5 లక్షల విలువైన దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్ నిఖిల్ ధనుంజయ్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు కంపెనీ ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బంటు మహేందర్, మాజీ సర్పంచులు వల్దాసు లక్ష్మయ్య, కొండ సరితాసైదులు, నోకల సైదులు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్రవంతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి కోసం మామపై కోడలు దాడి

వేములపల్లి, డిసెంబర్ 8: ఆస్తి కోసం వృద్ధుడైన మామపై కోడలు చెప్పుతో దాడి చేసిన ఘటన మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగనపల్లి బుచ్చిరెడ్డి అనసూర్య దంపతులకు ఇద్దరు కుమారులు. వారికి వివాహాలయ్యాయి. తల్లిదండ్రులు ఇద్దరు కుమారులకు మూడెకరాల చొప్పున భూమిని పంచి ఇచ్చి తమ అవసరాల నిమిత్తం బుచ్చిరెడ్డి పేరా 20 గుంటలు, అనసూర్య పేర 3.10 ఎకరాలు ఉంచుకున్నారు. ఈ భూమిని ఇద్దరు కుమారులు సాగు చేసుకొని తల్లిదండ్రులుకు కొంతమొత్తం డబ్బులు ఇచ్చేలా మాట్లాడుకున్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి, కోడలు మణిమాల కొంత కాలంగా కౌలు డబ్బులు ఇవ్వడం లేదు. ఈ విషయాన్ని అడిగిన తనపై గత నెల 20న కోడలు మణిమాల చెప్పుతో దాడి చేసిందని బుచ్చిరెడ్డి తెలిపారు. ఇదే విషయమై గత నెల 21న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బుచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు మణిమాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్నాయి.

కబ్జాదారుల నుంచి మాణికేశ్వరి మాత ఆశ్రమాన్ని కాపాడాలి

- విలేకరుల సమావేశంలో సెంట్రల్ కమిటీ సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

రామగిరి, డిసెంబర్ 8: నల్లగొండలోని మాణిక్యేశ్వరి మాత ఆశ్రమాన్ని కొందరు కబ్జా చేసుకున్నారని, దానిని వారి బారి నుంచి కాపాడాలని ఆశ్రమ సెంట్రల్ కమిటీ సభ్యుడు జగ్జీవన్ రెడ్డి కోరారు. ఆదివారం నల్లగొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. మాణికేశ్వరి మాత పీఠాధిపతిగా చెప్పుకుంటున్న నట్టు రణదేవ్ మహరాజ్ జిల్లా కేంద్రంలోని గంధంవారి గూడెంలోని ఆశ్రమంలో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న గంగాధరాచారిని బలవంతంగా బయటికి వెళ్లగొట్టి ఆశ్రమాన్ని కబ్జా చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమానికి పీఠాధిపతి ఉండరని మాణికేశ్వరి మాత మాత్రమే పీఠాధిపతి అని, నిర్వహణ బాధ్యతలను కర్ణాటకలో ఉన్న సెంట్రల్ కమిటీ చూస్తుందన్నారు. కానీ రణదేవ్ మహరాజ్ తనకు తానే పీఠాధిపతినని ప్రకటించుకొని ఆశ్రమాన్ని కబ్జా చేశారని తెలిపారు. ఈ విషయమై నల్లగొండ డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆశ్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రతినిధులు జ్ఞానేశ్వర్, వీరన్న, వెంకట్‌రెడ్డి, బీరప్ప, శాంతన్న, శంకరన్న, జగజీవన్‌రెడ్డి, రామకృష్ణ, నాగిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వారం వ్యవధిలో అన్నదమ్ముల మృతి

- కుటుంబంలో తీరని విషాదం

నలమాద లక్ష్మయ్య, కృష్ణ (ఫైల్)

కట్టంగూర్, డిసెంబర్ 8 : మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు వారం వ్యవధిలో మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నలమాద శంభయ్య–కళమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు లక్ష్మయ్య పీహెచ్‌డీ చదివి హైదరాబాద్‌లోని హరజన్ లైఫ్‌సైన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 2న గుండెపోటుతో మృతి చెందాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు కృష్ణ డిగ్రీ వరకు చదివి హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ ఈ నెల 7న మృతి చెందాడు. కృష్ణకు భార్య, కుమార్తె ఉన్నారు. వారం వ్యవధిలో ఇద్దరు కుమారులు మృతి చెందడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. వృద్ధ దంపతులు కన్నీరు మున్నీరవుతున్నారు.